క్లుప్తంగా

కేంద్ర బృందం సర్వే



ఇంటి పరిసరాలు పరిశీలిస్తున్న అధికారులు

చొప్పదండి: స్వచ్ఛ సర్వేక్షన్–2025లో భాగంగా పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు మండలంలోని ఆర్నకొండ, సాంబయ్యపల్లి గ్రామాల్లో సోమవారం కేంద్ర బృందం అధికారులు సర్వే నిర్వహించారు. అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంస్థ నుంచి ఇన్‌వెస్టిగేటర్స్ రాణి, రజిత ఆయా గ్రామాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. చెత్త సేకరణ తీరు, తరలింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు, వ్యర్థాల నిర్వహణ, ఎరువుల తయారీ, ప్లాస్టిక్ వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లోని పదహారు నివాస గృహాలను సందర్శించి అభిప్రాయాలను తీసుకున్నారు. వెంట ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ రమేశ్, వేణు, ఎంపీడీవో రేగులపాటి వేణుగోపాల్ రావు, ఎంపీవో రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: మండల కేంద్రంలోని రైతు వేదికలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ, న్యూట్రీ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు కంది విత్తన బ్యాగులు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఏవో రమ్యశ్రీ ఆధ్వర్యంలో మండలంలోని 30 మంది రైతులకు వందశాతం సబ్సిడీపై అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కుతుబుద్దీన్, ఓరుగంటి భారతీదేవి, బొడిగె పర్శరాములు, ఏఈఓలు ఫరీదు, సాయికుమార్, సతీష్, ప్రణయ్, అంజలి రైతులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

ఇల్లందకుంట: ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం సోమవారం మండలకేంద్రంలో బూత్‌స్థాయి అధికారులకు, సూపర్‌వైజర్లకు ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంటింటి సర్వే, బూత్ స్థాయి అధికారుల విధులు, ఎన్నికల నియమ నిబంధనలతో పాటు పలు అంశాల గూర్చి తెలిపారు.

ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులతో అధికారులు

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధు రమ్య మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పురస్కారాలు అందించారు. ఎస్‌ఐ నరేశ్‌రెడ్డి, ఎంఈవో మోహన్ కార్యక్రమానికి హాజరయ్యారు. మండల టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. ఉపాధ్యాయుడు ర్యాకం మహేశ్ టాపర్‌కు రూ.పదివేల నగదు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్,టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నేతలు

చొప్పదండి: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండలంలో సోమవారం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. హామీలను నిలబెట్టుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ప్రాథమిక పాఠశాలల్లో పదివేల హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేస్తామని, ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.హరిచరణ్, రంగోజు శ్రీనివాస్, ఎం చంద్రశేఖర్, కె. సాయన్న, జి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం బయటపడుతోంది. కాంట్రాక్టర్ గుండ్లపల్లి నుంచి గునుకులకొండాపూర్ వరకు గతేడాది రోడ్డు పనులను చేపట్టాడు. గునుకులకొండాపూర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే రెండు వ్యవసాయ బావుల ఉండగా వాటి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండానే బీటీ పనులు పూర్తి చేశాడని ప్రయాణికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాగా ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఓ బావి వద్ద రోడ్డు బావిలోకి కుంగి పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇటీవల గ్రామ పంచాయతీ సిబ్బంది బావుల వద్ద కట్టెలు, షేడ్‌నెట్‌తో తాత్కాలిక రక్షణ చర్యలు ఏర్పాటు చేశారు. లేదంటే పెను ప్రమాదం సంభవించేది. అధికారులు రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



బావి అంచున కుంగిన రోడ్డు



శాకాంబరిదేవిగా దర్శనం ఇస్తున్న అమ్మవారు

శాకాంబరీదేవిగా దర్శనం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీకన్యాకపరమేశ్వరి ఆలయంలో ఆషాఢమాసం పురస్కరించుకొని శ్రీవాసవి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారు శాకాంబరిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు, మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారి పారాయణం నిర్వహించారు. అనంతరం గోరంటాకు ఉత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు, వ్యవస్థాపకుడు ముక్కా కాశయ్య చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యుడు ముక్కా జితేంద్రర్‌గుప్తా, భక్తులు పాల్గొన్నారు.



చొప్పదండి: పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా గోరింటాకు ఉత్సవం

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో సోమవారం గోరింటాకు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి మహిళా సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ భజనమండలి సభ్యులు సంకీర్తనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్ గౌడ్, గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, వైస్ చైర్మన్‌లు బొడిగె వెంకన్న, ఎలిగేటి రాములు, కోశాధికారి దండె సత్యానందం, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మాజీ కౌన్సిలర్‌లు, గాయకులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో కలిశారు. పనులకు సంబంధించి బిల్లులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపేశాడని, దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పర్యటించారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ కొండాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన జైలుకెళ్లడానికి సిద్ధం

హుజూరాబాద్: అమలు కానీ హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన పోరాడుతూ జైలుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమలాపూర్ మండలానికి చెందిన వందమంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. రైతు, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో నాయకులు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, నవీన్, ఇంద్రసేనారెడ్డి, కేడీసీ డైరెక్టర్లు కృష్ణప్రసాద్, రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్లు తదితరులున్నారు.



ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు–భోగంపాడు గ్రామాల మధ్య లో లెవల్ కల్వర్టుపై గుంతలు ఏర్పడ్డాయి. కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఇరువైపులా రక్షణ దిమ్మెలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో కల్వర్టుపై నుంచి డక్కుల చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించినప్పుడు ఇరు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. హై లెవల్ వంతెన నిర్మించాలని, సంబంధిత అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్, హుజూరాబాద్ డివిజన్ అధికారి, సెల్ నంబర్: 9440818419

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



రామడుగు: బోనాల వేడుకల్లో విద్యార్థులు, నరేందర్‌రెడ్డి



హుజూరాబాద్‌లో...

అల్ఫోర్స్‌లో బోనాల వేడుకలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్‌లో సోమవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ సంస్థల అధినేత వి. నరేందర్‌రెడ్డి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్‌లో బోనాల జాతర కన్నుల పండువగా జరిగింది. ఈసందర్భంగా విద్యార్థుల పోతరాజు వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా విద్యార్థుల గ్రామదేవతల వైభవం, నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి హాజరై కార్యక్రమానికి తిలకించారు.

సంక్షిప్త వార్తలు

● ప్లేట్లు పంపిణీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం హోంగార్డు అనిల్ తన తల్లి స్మారకార్థం ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారని ప్రధానోపాధ్యాయురాలు శారద తెలిపారు.

● విద్యార్థులకు అవగాహన

హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం అంతర్జాతీయ సహకార సంఘాల దినోత్సవం పురస్కరించుకొని జూపాక సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార సంఘం నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు.

● కార్మిక వ్యతిరేక జీవో రద్దు చేయాలి

జమ్మికుంట: కార్మికులకు వ్యతిరేకంగా తీసుకవచ్చిన జీవోను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్ర కార్మిక వర్గం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

● మొహర్రం వేడుకలు

రామడుగు: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పీరీలతో ఊరేగింపు నిర్వహించగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ప్రత్యేక పారిశుధ్య పనులు

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేట తొమ్మిదో వార్డులో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. రోడ్లపక్కన పిచ్చి మొక్కలను తొలగించామన్నారు.

● బ్రిడ్జి నిర్మాణానికి అధికారుల పరిశీలన

జమ్మికుంటరూరల్: మండలంలోని వావిలాల గ్రామ ప్రజలు వర్షాకాలంలో పొలాలు, శ్మశాన వాటికు చెరువు మత్తడి నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కొండ హరీష్, రైతులతో కలిసి శనివారం కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కరానికి కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు సోమవారం ఏఈ శివకుమార్, గ్రామ కార్యదర్శి రాము, రైతులతో కలిసి మత్తడి స్థలాన్ని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం లేదా పెద్ద పైపులు వేసేందుకు ఎస్టిమేషన్ వేశారు. ఎస్టిమేషన్ పత్రాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

● జాబ్ క్యాలెండర్‌పై పట్టింపులేదు

చిగురుమామిడి: రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పథకాలను ఎందుకు నిలిపివేశారో చెప్పాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్ల యుగేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఓగులాపూర్ గ్రామంలో ఏఐవైఎఫ్ గ్రామ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నికున్నట్టు నాయకులు తెలిపారు.

● పండ్లు పంపిణీ

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధి స్పందన వృద్ధాశ్రమంలో గ్రామస్తులు, నాయకులు సోమవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు జన్మదినం పురస్కరించుకొని పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయం వద్ద గజమాలతో సన్మానించారు.

● ఉచిత కంటి వైద్య శిబిరం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో జయన్న ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. పలువురికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట బస్టాండ్ వద్ద సోమవారం గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మందికి షుగర్, బీపీ పరీక్షలు చేశామని నిర్వాహకులు తెలిపారు.

● మహిళా మత్స్యకార సొసైటీ

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్‌లో ప్రగతి మత్స్యకార్మిక సేవా సమితి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు గూడెల్లి మల్లేశం ఆధ్వర్యంలో మహిళా కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటైంది. అన్నిరంగాల్లో మహిళలకు ప్రాధాన్యత పెరుగుతున్న తరుణంలో మత్స్యకార వృత్తిలో భాగస్వాములను చేయడానికి సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ సభ్యులు సోమవారం మత్స్యశాఖ డీఎఫ్‌వో విజయభారతి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎఫ్‌డీవో మంజులను వారి కార్యాలయాల్లో కలిసి శాలువాలతో సన్మానించారు.

● రెడ్డి సంఘం ఎన్నిక

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ హనుమాన్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా సింగిరెడ్డి భూంరెడ్డి సోమవారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రధాన కార్యదర్శిగా జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి, కోశాధికారిగా నర్ర ప్రభంజన్‌రెడిని ఎన్నుకున్నారు.

● సన్మానం

రామడుగు: ప్రజా ఉద్యమ కవి, గాయకుడు నేర్నాల కిషోర్ తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యుడిగా నియామకమయ్యాడు. సోమవారం కరీంనగర్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి జలపతి, గసికంటి కుమార్ హైదరాబాద్‌లో కిషోర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో సన్మానించారు.

● రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్‌రూరల్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌పోటీలకు బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి అనర్విన్య వెంగల్‌దాసు ఎంపికైంది. ఇటీవల గోదావరిఖనిలో జరిగిన అండర్–16 విభాగంలో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 9నుంచి 12వరకు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుంది. సోమవారం ఎంపికైన విద్యార్థిని పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాధన్, పీడీ సుంకరి మురళీధర్, కోచ్‌లు అనూష్, సాయికిరణ్ తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ మృతి

ఇల్లందకుంట: అప్పులబాధ భరించలేక పురుగు మందుతాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి రాచపల్లికి చెందిన పెద్ది సమ్మయ్య(45) మూడెకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య సుగుణ ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్ద కూతురు వివాహం చేసి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడుతూ మద్యానికి బానిస అయ్యాడు. జూన్ 29న పొలం వద్ద పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం జమ్మికుంటలోని ఆసుపత్రికి అక్కడి నుంచి వరంగల్ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి పెద్ది ఐలయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

బేకరీపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: పట్టణంలోని ఓ బేకరీలో ఉత్పత్తి చేస్తున్న తినుబండరాలపై తయారీ, గడువు తేదీ లేకుండా అమ్మకాలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తయారీలో నాణ్యత లేకపోవడంతో ప్రజలు అనారోగ్యంబారినపడతారని, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్, అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చెరువు శిఖం భూమి కాపాడాలని ఫిర్యాదు

ఇల్లందకుంట: రాచపల్లి గ్రామ పంచాయతీ పరిధి చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తున్నవారి నుంచి కాపాడాలని గ్రామానికి చెందిన రాజయ్య సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, విచారణ చేసి కబ్జా చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశానవాటిక రోడ్డు కబ్జాపై...

జమ్మికుంట: పట్టణంలోని హిందూ శ్మశానవాటిక రోడ్డును కబ్జా చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కులవ వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు కిషోర్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

ఆమె కళ్లు సజీవం

జమ్మికుంట: జమ్మికుంట పట్టణానికి చెందిన మాడ జయలక్ష్మి(72) సోమవారం గుండెపోటుతో మృతిచెందింది. ఆమె కుమారుడు రాజ్‌కుమార్‌కు సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు మచ్చగిరి నరహరి నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఎల్‌వీపీ వరంగల్ టెక్నీషియన్ నరేందర్ మృతురాలి నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీపీ ఐ బ్యాంక్‌కు పంపించారు. జయలక్ష్మి కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి భీష్మాచారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు

హుజూరాబాద్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, యూట్యూబ్ రిపోర్టర్ పరకాల సమ్మయ్యగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాల నాయకులు సోమవారం సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. మాలజాతి యుద్ధ వీరుడు మాల కన్నమదాసు చిత్రపటంలోని తల భాగాన్ని తొలగించి ఎమ్మెల్యే తలభాగాన్ని అతికించి వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేసి అవమానపరిచారని, ఎమ్మెల్యే, యూట్యూబ్ రిపోర్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అలాగే మాల జాతికి బేషరత్‌గా క్షమాపణ చెప్పాలన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కేశవపట్నంలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నాయకులు ఘనంగా నిర్వహించారు. అలాగే మందకృష్ణ మాదిగ జన్మదినం కావడంతో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. 1994లో ఇరవై మంది యువకులతో ఎమ్మార్పీఎస్ ఏర్పడిందని, ఎన్నో సామాజిక ఉద్యమాలు చేసిందని, బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాడిందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు.

సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు



కరపత్రాలు పంచుతున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక, సామజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సోమవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన వామపక్షాల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ కార్మికుల, గ్రామీణ పేదల శ్రమను కార్పొరేట్ శక్తుల లాభాల కోసం పాలకులు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, బీర్ల పద్మ,కొట్టే అంజలి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్: సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ సిబ్బంది బస్సులు బంద్ చేసి సమ్మెలో పాల్గొనాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె కరపత్రాలు, బుక్‌లెట్స్ పంపిణీ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ రవాణా రంగం ఎంవీ యాక్ట్ సవరణ చట్టం వల్ల ఆర్టీసీ మొత్తం పెద్ద కార్పొరేట్ కంపెనీలు ఎలక్ట్రికల్ బస్సుల రూపంలో స్వాధీనం చేసుకున్నాయని,కొత్తగా ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. నగర కార్యదర్శి మల్లయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

శంకరపట్నం: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య కోరారు. కేశవపట్నంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సదానందం, సాయిలు, లక్ష్మణ్, మహిళ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన యువకుడు బొల్లి వినయ్ కడుపునొప్పితో బాధపడుతూ సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. వైద్యంకు రోజుకు రూ.యాభైవేలు ఖర్చు అవుతుందనడంతో విషయం తెలిసిన ఫైటర్ ఫ్రెండ్స్ టీమ్ సభ్యులు విరాళాలు జమచేశారు. లక్ష రూపాయలు వైద్యఖర్చుల నిమిత్తం సోమవారం వినయ్ తల్లికి అందించారు. పలువురు ఫైటర్ ఫ్రెండ్స్‌ను అభినందించారు. సభ్యులు హరీశ్, సందీప్, అనిల్, ప్రభంజన్, శ్రీధర్, నితిన్, మహేందర్, రాకేశ్‌కన్నా, శ్రీనాథ్, సంతోష్, కళ్యాణ్ పలువురు ఉన్నారు.

మందులు అందుబాటులో ఉంచండి

కరీంనగర్‌టౌన్: ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల కోసం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ అఫ్షాన్‌ను డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆదేశించారు. సోమవారం వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై ఆరాతీశారు. అవుట్ పేషెంట్ విభాగం సేవలు, లాబరేటరీ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు వివరాలు పరిశీలించారు. అనంతరం నగరంలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసే ఐదు ఆసుపత్రులను తనిఖీ చేశారు. రికార్డులు మెయింటెన్ చేయాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు. పీవోఎంసీహెచ్ డాక్టర్ సన జవేరియా, డీపీవో ఎన్‌హెచ్ ఎం.స్వామి, సూపర్‌వైజర్ సాబీర్, రమేశ్ పాల్గొన్నారు.



వెల్‌నెస్ ఫార్మసీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ